# అద్దంలో అబద్ధం

ఆ నిశిరాత్రి...

ఆమె కనుకొలుకుల్లోంచి కన్నీటి విత్తనం మొలకెత్తుతోంది.

గుండె కవాటాలు దాటి అంతః ప్రవంతిలా నరాల్లోకి పాకుతోన్న వేదనని పీలుస్తూ... ఆ విత్తనం తీగలల్లుకుంటూ బుగ్గలపైకి పాకుతోంది.

ఆమె పెదాల మధ్య సంద్రకెరటం చిక్కుకున్నట్టు ఉప్పగా తగిలి, అక్కణ్ణించి తిరిగి గుండెల్లో పడి ఇంకిపోయింది. పోతూపోతూ.... నిట్టూర్పునీ, నిస్సహాయతనీ మిగిల్చిపోయింది.

నీరజ బాధతో కణతలు నొక్కుకుంది. మండుతోన్న రెప్పల చిప్పల్ని బరువుగా మూస్తే కుప్పలు కుప్పలుగా రాలిపడ్డాయి కన్నీటిబొట్లు.

ఒంటరిగా ఉన్నవారికి కన్నీళ్ళే తోడు....

రగ్గుకప్పుకొని పడుకొంటూ సీలింగ్ ఫ్యాన్‌కేసి చూసింది.

'తాడును తోడుగా తెచ్చుకుంటే... హెల్ప్‌చెయ్యనా? ' అన్నట్టుగా తోచిందది. డబుల్‌కాట్‌పై మరోవైపు పొర్లింది నీరజ.

అక్కడే.... ఆ స్థానంలోనే అతడు లేడు... కాదు. ఈ మధ్య రాత్రిళ్ళు అతడు ఉండటంలేదు. మొన్న మొన్నటి వరకూ అతడ్ని పసిపిల్లలా చుట్టుకొని పడుకొన్న రాత్రిళ్లు... ఇప్పుడు తెల్లారి అతడు రాగానే కాళ్ళను చుట్టేసుకొని వెక్కిళ్ళమధ్య ఏడ్పులు.

ఎన్నిరాత్రులు? ఎన్నిరోజులు?

మొన్నటివరకూ సీతాకోకచిలుకలా చూసినవాడు ఇప్పుడు గొంగళి పురుగుగా ఈసడిస్తున్నాడు.

బతుకులో తిరోగమనం...

అవినాభావ సంబంధంలోంచి మగాడి తిరోగమనానికి కారణం మరో ఆడదాని పురోగమనం... ఫలితంగా కట్టుకున్నదానికి అగమ్యగమనం...

నీరజ స్థితీ అంతే...

కన్నీళ్ళన్నీ ఆవిరయ్యాక అదే బరువు గుండెలోంచి కోరిక.... ఎన్నో రాత్రిళ్ల చీకట్లో సమాధి చేయబడుతున్న కోరిక.

ప్రక్కలో ఏడ్పు వినిపించింది. మూడేళ్ళ బాబు!

క్షణంలో ముంచుకొచ్చిన మాతృత్వపు పొంగు, ఇన్ని అనుభూతున్ని పదిలపర్చుకున్న గుండెకు కన్నీటి గండపెండేరాన్ని మళ్ళీ తొడిగింది. ఆ కన్నీళ్ల దూకే సెలయేర్లై గొంతు పలికించిన సన్నని ఏడ్పు దిగమింగుకుంటూనే బాబుని హత్తుకొని బావురుమంది. చిన్నారి చేయి పాల కోసం పాకుతుంటే నీరజకు నిద్రపట్టింది చాలా సేపటికి.

తెల్లారినా అతడు రాలేదు....

వస్తాడన్న నమ్మకమూ లేదు...

వచ్చినా శాశ్వతంగా ఉంటాడన్న నిజం లేదు...

ఉన్నా మునుపటి ప్రేమని పంచుతాడన్న ఆశా లేదు...

ఎందుకో ఆమెకు తాళిబొట్టు కళ్లకద్దుకోవాలన్పించలేదు. అవి ఇనుప చక్రాల్లా కన్పించాయి. ఆ చక్రాలు తన గుండెలమీద మరింత బరువనిపించాయి.

'మను జీవన హేతునా' అన్న శ్లోక తరంగాలు అతన్ని ఏనాటి కయినా వెనక్కి రప్పిస్తాయనే ఆశ చచ్చిపోయాక....తనేం తప్పుచేసిందో ఆలోచిస్తోందామె.

చదువుకున్నదీ.... సంస్కారం కలదీ.... ఎన్నో రాత్రుళ్లు అతన్ని తృప్తిపరిచింది. అయినా అతడు సుఖాన్వేషణలో మరో ఆడదాన్ని వెతుక్కుంటూ పోయాడు.

నీరజ బాబుని చంకనేసుకొని నేరుగా పోలీసుస్టేషన్‌కి వెళ్ళింది.

"నన్ను అరెస్టు చెయ్యండి" ఎస్.ఐ.గారి ముందు వినయంగాఅంది. మొహంలో ఎలాంటి హత్య చేసినట్టు దాఖలా కన్పించకపోతే ఎస్.ఐ. గారు విస్మయంగా చూశాడు. ముందు కూచోమన్నాక, ఇప్పుడు చెప్పండి. ఏం తప్పు చేశారు? అని నిదానంగా అడిగాడు చూస్తున్న ఫైలు ప్రక్కన పడేసి.

'నన్ను అరెస్టు చెయ్యండి' మరోసారి అంది నీరజ.

"అదేనమ్మా.... ఎందుకనీ?"

"మావారు ఒక వేశ్యకు అలవాటుపడ్డారు" ఆమెకంఠంలో కాఠిన్యం కన్పించలేదు. కాని ఆ మాటల్లో గంభీరం తొణికింది. "అదేంటి?" ఎస్.ఐ గారి ముఖంలో ఆశ్చర్యం, అనుమానం.

"నేను సుఖాన్ని పంచలేకపోయానేమో....మావారు మరోసుఖాన్ని వెతుక్కుంటూ పోయారు"

"చెప్పదల్చుకున్నదేదో వివరంగా చెప్పండి" కొంచెం ఖాకీరకం విసుగు.

"వ్యభిచరించినందుకు వేశ్యనీ.... ఆ సమయంలో పట్టుబడినందుకు విటుడ్ని మీరు అరెస్టు చేస్తారు. కాని ఇన్‌స్పెక్టర్‌గారూ, నా దృష్టిలో విటుడి భార్యని అరెస్టుచేసి శిక్షించాలి." అందామె కొంచెం ఆవేశంగా.

ఎస్.ఐ.కి ఆమె భావం, ఉద్దేశ్యం అర్థమై చిత్రంగా చూసినవ్వాడు. ఆ తర్వాత నిదానంగా చెప్పాడు.

"మీరన్నది నిజమే కావచ్చు. పెళ్లాం పంచలేని సోయగాలు వేశ్య పంచి ఆకర్షిస్తుంది. కాదనను. కాని అందని వస్తువుకోసం ప్రాకులాడేది

మగాడి మనస్తత్వం. ఈరోజునించీ ఈ వస్తువు నా స్వంతం అనుకుంటే అదెంతటికి గొప్పదైనా... మర్నాటినుంచి నిర్లక్ష్యం ప్రారంభమవుతుంది ఎవరిలోనైనా. భార్యల విషయంలో చాలామంది భర్తల ప్రవర్తన ఇలాగే ఉండొచ్చు. అలాగని మీ భర్త మరో ఆడదాని వలలో పడితే... మీతప్పు అని బాధపడుతున్నారేమో.... ఒక విధంగా ఆత్మవంచన చేసుకుంటున్నారేమో... రేపు వేశ్య సుఖంలో రొటీన్‌ని ఇష్టపడక మరో ఆడదాని కోసం అతడు వెదకొచ్చు. ఆ వేశ్య కూడా మీలాగే సుఖం పంచలేక పోయానేమోనని నన్ను శిక్షించండని స్టేషన్ కొస్తే ఈపాటికి దేశంలోని స్టేషన్‌లన్నీ మీ ఆడాళ్ళతో నిండిపోయేవి. ఆ రకం మగాళ్ల మనస్తత్వమే అంత... రక్తం మరిగిన పులికి వేటాడటమే దినచర్య, అంతేగాని మీ తప్పేముంది? అద్దంలో చూసుకుంటూనే అబద్ధాన్ని ఊహించుకుంటున్నారు మీరు"

ఆమె నిముషం పాటు ఆత్మను తొలుచుకుంది. విమర్శని వెతుక్కుంది.

"నా మాటలో నిజం మీకిప్పుడు తెలీకపోవచ్చు. ఆ వేశ్య బోర్ కొట్టాక అతడు తిరిగి మిమ్మల్ని చేరుకోవచ్చు. కొంత టైమ్ తీసుకొని..." అన్నాడు మళ్ళీ ఎస్.ఐ.

"అతడలా చేరుకుంటాడేమోనని ఆశతోనే ఇన్నాళ్ళూ...." ఆమె గొంతు పూడుకుపోయింది బాబు ఒడిలో అసహనంగా కదులుతున్నాడు.

"నన్నే చేరుకుంటాడన్న నమ్మకం పోయింది. ఎప్పుడో ఓసారి డబ్బుకోసం వస్తున్నాడు. ఒకసారి డైవోర్స్ గురించి ఆలోచించినా.... విడాకులిచ్చిన ఆడదానికి ఈ సంఘమిచ్చే గౌరవమేంటో గుర్తెరిగి.... ఇలా ఉండి బాధపడటమే నయమేమోననిపిస్తోంది" ఎస్.ఐ.లో ఒక ఆత్మీయుడ్ని చూసుకొని చెప్పుకుందామె.

'కంప్లయింట్ రాసివ్వండి....ఓ సారి హెచ్చరిస్తాం!'

"వద్దు" అందామె చప్పున.

తాళికట్టిన కర్కోటకుడి మీద సగటు ఆడదాని భయం కళ్ళల్లో కదలాడింది. బాబు ఏడ్వటంతో ఆమె నిస్సహాయంగా బయటికి వచ్చింది.

దారిలో నడుస్తూనే బతుకు రహదారికోసం వెతుకుతోంది. నీరజ వచ్చేసరికి ఇంటిముందు అతడున్నాడు.

భర్త!!!

వరకట్నం పేరుతో మీరు లక్షలిస్తే కొన్ని వందల రాత్రులు హోల్ సేల్‌గా సుఖపెడుతున్నామనే భర్త...

వ్యభిచారం పేరుతో పదోపరకో ముట్టచెప్పి మరో సుఖాన్ని కొనుక్కుంటున్నామనే భర్త. పెళ్లామంటే వరకట్నమిచ్చి వ్యభిచరించే పర్మినెంట్ వేశ్యగా భావించే భర్త.... నిల్చున్నాడు. నిర్లక్ష్యంగా... అసహనంగా....

అయినా ఆమెలో ఏదో ఆనందం...ఆశ....ఆరాటం. అతన్ని చూడగానే అన్నిటితో పాటు భయమూ కలిగాయి. విస్కీ వాసన తగిలింది. చేతికి వాడిన మల్లెపూల దండ చుట్టబడి ఉంది.

"పోలీసు స్టేషన్ నుంచి బయటికొచ్చిన ఆడదాన్ని ఏ మగాడైనా నమ్మగలడా?"

బాబుని దింపి తాళంకప్ప తెరుస్తోన్న ఆమె ఆ మాటకు గిరుక్కున వెనుదిరిగింది.

"నేను రాత్రిళ్ళు పోతున్నాను... నువ్వు పగలే పోతున్నావ్...జస్ట్ తేడా..." సిగరెట్ పొగ రింగులాదుతూ అతడెటో చూస్తూ అంటున్నాడు.

"పోలీసు స్టేషన్‌లోనే పని జరిపితే.... ఇక పట్టుకునే వాడెవ్వడు? ఎంతైనా మంచి ఆలోచన..." అంతే! క్షణంలో తాళంకప్ప అతడిముక్కు మీద బలంగా తాకింది. బొటబొటా రక్తం కారింది. అతడు అమ్మా అని అరిచేలోగా నీరజ బాబుతో సహా ఇంట్లో దూరి గొళ్ళెం పెట్టుకుంది.

అతడు తలుపులు బాదుతున్నాడు బండబూతులు తిడుతూ.

తలుపులు విరుగుతాయా అన్నంత బలంగా బాదుతున్నాడు. ఈ గలాభాలో బాబు ఏడ్పులంకించుకున్నాడు.

లోపల నీరజ వెక్కివెక్కి ఏడుస్తూ గోడకి జారగిలబడితే ... బయట అతడు నీరసపడిపోయి వెళ్ళిపోయాడు. వాడి అడుగుల చప్పుడు దూరమవటం స్పష్టంగా వింది.

ఎస్.ఐ. మాటలు మననం చేసుకుంటే.... తను అద్దంలోఅబద్ధాన్ని చూసుకున్నాననుకుంది నీరజ. అతడెన్నడూ మారని తేనెటీగ అనుకొంది. ఈ స్థితిలో పుట్టింటికెళ్ళటం ఇష్టంలేదు.

కామంతో, కామెర్లతో నిండిపోయిన వాడు మాతృత్వం పొంగి పిల్లాడికి పాలు పట్టిస్తున్న తల్లి స్తన్యంలో కూడా సుఖాన్ని వెదుకుతాడేమో. వాడితో జీవితం పంచుకోవటం ఇక అసాధ్యమనిపించింది...

అందుకే ఆలోచించింది....రవిచంద్ర గుర్తొచ్చాడు.

డైరీలు తీసి అడ్రస్ వెదికింది. కాలేజీలో తనని అభిమానించి, ఆరాధించే రవిచంద్ర... తన ప్రేమను పొందలేకపోయినందుకు జీవితాంతం బ్రహ్మచారిగా ఉంటానని ప్రమాణంచేసి బొంబాయి వెళ్ళిపోయిన రవిచంద్ర... ఎప్పుడైనా, ఎప్పుడొచ్చినా తనకోసం తలుపులు తెరిచి ఉంచుతానన్న రవిచంద్ర.... నా మనసు అద్దంలాంటిది. ఎప్పుడైనా నీ ప్రతిబింబం చూసుకో అని చెప్పిన రవిచంద్ర....

అడ్రస్ దొరికింది!

ఆమె ఒక నిర్ణయానికి వచ్చి.... తన అభిమానాన్ని, ఆరాధననీ పంచుకోవడానికే బాబుతోసహా వస్తున్నానని టెలిగ్రామ్ ఇవ్వడానికి బయలు దేరి తలుపు తీసిన నీరజకు....

ఎదురుగా అతడు...
పోస్ట్‌మాన్ !!

వెడ్డింగ్ కార్డ్ చేతిలో పెట్టి వెనుదిరిగాడు. కవరు మీద అందమైన అక్షరాలు!

"రవిచంద్ర వెడ్స్ మధులత"

కవరు విప్పలేదామె. అద్దంలో అబద్ధం మరోసారి విశ్వరూపమై కన్పించింది. ఆ అక్షరాలు చదివి నీరజ కనుకొలుకుల్లోంచి కన్నీటి విత్తనం మొలకెత్తింది మళ్ళీ ...

అది తీగలల్లుకుంటూ బుగ్గలపై పాకుతోంటే రెప్పలు మసక మసగ్గా చీకటిని కప్పుతున్నాయి.

★